# ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నేడు ముఖ్యమంత్రి పర్యటన

- పలుచోట్ల 'సీతారామ' పంప్‌హౌజ్‌లు ప్రారంభం
- వైరాలో భారీ బహిరంగ సభ
- రైతు రుణమాఫీ మూడో విడత విడుదల

ఖమ్మం, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం ఉమ్మడి ఖమ్మంజిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాకు వరప్రదాయినిగా నిర్మాణంలో ఉన్న సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన పలుచోట్ల పంప్‌హౌజ్‌లను ప్రారంభించి వైరాలో ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా సాగునీటిని విడుదల చేయనున్నారు. అదేవిధంగా వైరా వేదికగా రూ.2 లక్షల రైతు రుణమాఫీ మూడోవిడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఉదయం హైదరాబాద్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఉదయం 11:45 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ సీఎం రేవంతరెడ్డి సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌజ్-2ను ప్రారంభించి ఫైలాన్‌ను ఆవిష్కరిస్తారు. ముఖ్యమంత్రితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హాజరుకానున్నారు. ములకలపల్లి మండలం కమలాపురం వద్ద ఏర్పాటుచేసిన మరో పంపుహౌజ్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో నిర్మించిన పంప్‌హౌజ్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభిస్తారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొని అక్కడే మీడియా సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం అక్కడి నుంచి 2:15 గంటలకు రెండు హెలికాప్టర్ల ద్వారా నియోజకవర్గ కేంద్రమైన వైరాకు చేరుకుంటారు. అక్కడ రైతులతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ మూడోవిడత కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. ఈ సందర్భంగా వేదికపైన పలువురు రైతులకు రుణమాఫీకి సంబంధించిన చెక్కులను అందించనున్నారు. అనంతరం కార్యక్రమాలను ముగించుకుని సాయం త్రం 4:45 గంటలకు వైరా నుంచి హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పోలీస్ అధికారులు భారీ బందోబస్తుతో భద్రతా ఏర్పాట్లు చేశారు.

# సీతారామ.. కేసీఆర్ మానస పుత్రిక

- ఈ ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు
- జిల్లాలోని ముగ్గురు మంత్రులది గోబెల్స్‌ను మించిన ప్రచారం
- నేటి వైరా సభలో జిల్లా ప్రజలకు సీఎం వాస్తవాలు చెప్పాలి
- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు, నాయకులు

ఖమ్మం, ఆగస్టు 14 : భద్రాద్రి జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ఉద్యమ సారథి కేసీఆర్ మానసపుత్రిక అని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ఆయనే స్వయంగా రూపకల్పన చేసి నిర్మించిన ఎత్తిపోతల పథకం సీతారామ అని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీలేదని స్పష్టం చేశారు. కానీ.. కేసీఆర్ నిర్మించిన ఈ ప్రాజెక్టును వారి ప్రభుత్వం నిర్మించినట్లుగా జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు చెప్పుకుంటుండడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరాలో గురువారం జరిగే సభలో సీఎం రేవంత్‌రెడ్డి సీతారామ ప్రాజెక్టుపై వాస్తవాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పులు మాట్లాడినట్టుగా కాంగ్రెస్ మంత్రులు ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. కానీ.. హరీశ్‌రావు మాటల్లో తప్పేముందని ప్రశ్నించారు. 'సీతారామ ప్రాజెక్టుకు డిజైన్ చేసిందెవరు? కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన నిధులెన్ని? కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన నిధులెన్ని? ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్ర ఎంత? కాంగ్రెస్ ప్రభుత్వం పాత్ర ఎంత? సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్న మూడు మోటర్లు బిగించింది బీఆర్ఎస్ ప్రభుత్వమా? కాంగ్రెస్ ప్రభుత్వమా?' వంటి అనేక విషయాల గురించి ఉమ్మడి జిల్లా ప్రజలకు వాస్తవాలు వెల్లడించాల్సిన బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిపై ఉందని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తాము చేసినట్టుగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ మంత్రులు.. ఉమ్మడి జిల్లా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

## గ్యారెంటీ హామీలకు దిక్కులేదు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు పూర్తవుతున్నా ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారెంటీ హామీలకూ దిక్కులేదని తాతా మధు విమర్శించారు. పొరుగు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఆ మరుసటి నెల నుంచే పెంచిన పింఛన్‌ను కలిపి ఒకేసారి పంపిణీ చేస్తే.. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 8 నెలలు అవుతున్నా పింఛన్లు పెంచకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. అనేక బృహత్తర పథకాలను అటకెక్కించిందని ఎద్దేవా చేశారు. ఒకే విడతలో రూ.2 లక్షల రుణమాఫీ అంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పూర్తిస్థాయిలో మాఫీ చేయకుండా కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ 40 శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదని విమర్శించారు. కేసీఆర్ పాలన ఓ స్వర్ణయుగమని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ మంత్రులు గోబెల్స్‌ను మించారు: కమల్‌రాజు

బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని తాము చేసినట్లుగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ మంత్రులు.. బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారం చేయడంలో ఏకంగా గోబెల్స్‌నే మించిపోయారని డీసీసీబీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన సీతారామ ప్రాజెక్టును తాము పూర్తి చేసినట్లుగా చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, బెల్లం వేణు, ఉప్పల వెంకటరమణ, పగడాల నాగరాజు, తాజుద్దీన్, పగడాల నరేందర్ పాల్గొన్నారు.

# స్వాతంత్ర్యం.. ఎంతోమంది త్యాగఫలం : మాజీ ఎంపీ నామా

ఖమ్మం, ఆగస్టు 14 : భారతదేశానికి స్వాతంత్ర్యం.. ఎంతోమంది మహనీయుల త్యాగాల ఫలితమని బీఆర్ఎస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటిష్ పాలకుల చేతుల్లో బందీ అయిన మన దేశాన్ని విముక్తి చేయడానికి స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టడానికి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఆ పోరాటవీరులు, జాతీయ ఉద్యమనాయకుల దేశభక్తి వల్లే మనకు స్వాతంత్ర్యం లభించిందని పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటానికి నాటి స్వాతంత్ర్య పోరాటమే స్ఫూర్తి అని పేర్కొన్నారు.